సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం । 30 । సెప్టెంబర్ । 2024



యానిమేటర్ల ఆకలి కేకలు

వేతనాలు అందక యానిమేటర్లు ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబ పోషణ భారంగా మారింది. 8లో



టమాట కిలో రూ.47

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.47 పలికింది. కనిష్టం రూ.30, సరాసరి రూ.38 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.6°/23.4°

జిల్లా పరిధిలో ఆదివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఎస్పీ కార్యాలయంలో నేడు ‘ప్రజా సమస్యల పరిష్కారవేదిక’



పుట్టపర్తి టౌన్: ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ రత్న తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై నేరుగా అర్జీల ద్వారా తెలియజేయవచ్చని సూచించారు.


ఆరోగ్యాంధ్రప్రదేశ్‌లో డాక్టర్ల పాత్ర కీలకం



మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఐఎంఏ నాయకులు

ధర్మవరం అర్బన్: ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో వైద్యుల పాత్ర ఎంతో కీలకమైనదని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. పట్టణంలో ఆదివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 22వ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది సహకారంతోనే రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మారుస్తామన్నారు. వైద్యులు వృత్తిపరంగా కాకుండా ఒక సామాజిక బాధ్యతగా భావించి సహకరించాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునీకరించి మెరుగైన సౌకర్యాలు కల్పించేలా కృషి చేస్తామని తెలిపారు. అనంతరం వైద్యుల సమస్యలను మంత్రికి విన్నవించారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు జయచంద్ర నాయుడు, రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఫణీధర్, సభ్యులు నందకిషోర్, రవికృష్ణ, ధర్మవరం అధ్యక్షుడు జయకుమార్, కార్యదర్శి వాసుదేవరెడ్డి, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ రేపు



పుట్టపర్తి అర్బన్: ఎన్టీఆర్ భరోసా పింఛన్లు మంగళవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2,67,238 మంది పింఛన్‌దారులకు రూ.114.73 కోట్లు మంజూరైందని పేర్కొన్నారు. సోమవారం బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసి.. ఒకటో తేదీ తెల్లవారుజాము నుంచి 9,551 మంది సిబ్బంది పింఛన్లు అందజేస్తారని తెలిపారు. పంపిణీని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు పర్యవేక్షించాలని సూచించారు. రెండు రోజుల్లో పూర్తి చేసి.. మిగిలిన నగదు సెర్ప్‌కు చెల్లించాలని తెలిపారు. ముందస్తుగా గ్రామాల్లో చాటింపులు, ఆడియో రికార్డు, వాట్సాప్‌లలో ప్రచారం చేయాలన్నారు. గత నెలతో పోలిస్తే ఈ నెలలో 841 పింఛన్లు తగ్గాయి.

సత్ప్రవర్తనతో నడుచుకోవాలి




పుట్టపర్తి అర్బన్ స్టేషన్‌లో పాత నేరస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సునీత

పుట్టపర్తి టౌన్: పాత నేరస్తులు, రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని పోలీసులు సూచించారు. ఆదివారం ఎస్పీ రత్న ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పాతనేరస్తులకు, రౌడీషీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ రౌడీషీటర్లు, పాతనేరస్తులపై నిరంతర నిఘా ఉంటుందని, గ్రామాల్లో ఎలాంటి గొడవలకు వెళ్లినా, సమస్యలు సృష్టించినా.. ప్రేరేపించినా.. కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో నడుచుకొని ప్రశాంతమైన జీవితం గడపాలని సూచించారు. అనంతరం ప్రధాన రహదారులను తనిఖీలు చేసి.. రికార్డులు సరిగా లేని వాహనాలను స్టేషన్‌కు తరలించారు.

ఇష్టారాజ్యం.. బదిలీ బేరం

డీఆర్‌డీఏ, పరిశ్రమల శాఖలో బదిలీల పర్వం ఉద్యోగులను తీవ్ర అసంతృప్తికి గురిచేస్తోంది. సిఫార్సు లేఖల కోసం ఎమ్మెల్యేల ఇళ్లచుట్టూ పడిగాపులు కాయాల్సి రావడం ఒక ఎత్తయితే, బదిలీల కోసం సంబంధిత అధికారులు కూడా రూ. లక్షల్లో డిమాండ్ చేస్తుండడంతో వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇంతటి రాజకీయ జోక్యం, డబ్బు వసూళ్లు గతంలో ఎన్నడూ చూడలేదని వాపోతున్నారు. కూటమి సర్కారు కొలువుదీరిన వంద రోజుల్లోనే అసలు సంగతి గ్రహించామని, ‘కోరి తెచ్చుకున్న ఖర్మ’ చందాన ఉందంటూ గగ్గోలు పెడుతున్నారు.



- డీఆర్‌డీఏలో దారుణంగా బదిలీల ప్రక్రియ
- ముందుగా దూర ప్రాంతాలకు బదిలీ ఆదేశాలు
- ఉద్యోగి దారికొచ్చి డబ్బు ముట్టజెబితే కోరిన చోటకు పోస్టింగ్
- ఆర్డర్లు ఇప్పటికీ తీసుకోని చాలా మంది ఉద్యోగులు
- ఏపీడీ ఆధ్వర్యంలో వసూళ్ల పర్వం సాగుతోందని ఆరోపణలు
- పరిశ్రమల శాఖలోనూ ఇదే దుస్థితి
- గగ్గోలు పెడుతున్న ఉద్యోగులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: డీఆర్‌డీఏ (జిల్లా గ్రామీణాభివృద్ధి ఏజెన్సీ)లో బది‘లీలలు’ శ్రుతిమించాయి. ఒక్కో పోస్టుకు లక్ష రూపాయల బేరం పెట్టారు. శ్రీ సత్యసాయి, అనంతపురం రెండు జిల్లాలకు సంబంధించి అనంతపురం నగరంలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో బదిలీ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటివరకూ అనంతపురంలో పనిచేస్తున్న ఉద్యోగులను పుట్టపర్తికి బదిలీ చేశారు. పుట్టపర్తిలో పనిచేసే వారిని ‘అనంత’కు వేశారు. దీంతో అలాంటి వారు ఆర్డర్ లెటర్లు తీసుకోలేదు. ముందు దూర ప్రాంతాలకు బదిలీ ఆదేశాలిస్తారని, ఆ తర్వాత ఉద్యోగి దారికొచ్చి డబ్బు ముట్టజెబితే ఆదేశాలు మార్చి కావాల్సిన చోట పోస్టింగ్ ఇస్తున్నట్లు సమాచారం.

ఏపీడీ ఆధ్వర్యంలో వసూళ్లు!

బదిలీ ఆర్డర్లు తీసుకోని ఆయా ఉద్యోగులను అనంతపురం డీఆర్‌డీఏ కార్యాలయానికి పిలిపించి ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష చొప్పున వసూలు చేస్తున్నట్లు తెలిసింది. తాజాగా పుట్టపర్తి నుంచి అనంతపురం వచ్చిన ఒక సీనియర్ అసిస్టెంట్ రూ.లక్ష ఇచ్చినట్టు సమాచారం. వచ్చే నెల 5 వరకూ గడువు ఉండటంతో రోజూ కార్యాలయంలో ఉద్యోగులు వసూళ్ల పర్వంపైనే చర్చించుకుంటున్నారు. గ్రామీణాభివృద్ధిలో కీలక విభాగమైన డీఆర్‌డీఏలో అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో వసూళ్ల పర్వం సాగుతోందని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఈయనకు కార్యాలయ సూపరింటెండెంట్ జిలాని, హెచ్‌ఆర్ శ్రీనివాసులు, ఫైనాన్స్ విభాగం చూస్తున్న మజ్జిగ సత్యనారాయణ సహకరిస్తున్నట్టు బదిలీ అయిన ఉద్యోగులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఈ క్రమంలోనే తీవ్ర అవినీతి ఆరోపణలున్న పీడీ ఓబుళమ్మ బదిలీ ఆదేశాలొచ్చినా ఇప్పటికీ రిలీవ్ కాకపోవడం గమనార్హం.



అనంతపురంలోని డీఆర్‌డీఏ కార్యాలయం

అసలు పరిపాలన ఉందా..?

అన్ని విభాగాల్లోనూ బదిలీల పర్వం ప్రహసనంలా తయారైంది. ఇప్పటికే వీఆర్‌ఓలు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్ల బదిలీల్లో తీవ్ర గందరగోళం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ‘సాక్షి’తో కలెక్టరేట్‌కు చెందిన ఒక సీనియర్ అధికారి మాట్లాడుతూ జిల్లాలో అసలు పరిపాలన సరిగానే సాగుతుందో.. లేదో తెలియడం లేదని అనడం గమనార్హం. దీన్ని బట్టి పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

పరిశ్రమల శాఖలోనూ అంతే..

డీఆర్‌డీఏ తరహాలోనే పరిశ్రమల శాఖలోనూ వసూళ్ల పర్వం సాగుతున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రుల లెటర్లు తెస్తున్నా, పైస్థాయి అధికారుల ఇష్టాన్ని బట్టి బదిలీ జరుగుతోంది. డబ్బు లేనిదే పని కావడం లేదని ఓ ఉద్యోగి వాపోయారు. ఈనెల 22కే గడువు ముగిసినా పాత తేదీలు వేసి ఇప్పటికీ ఆర్డర్లు ఇస్తున్నారని శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన ఓ ఉద్యోగి వాపోయారు. ‘20 ఏళ్ల నుంచి ఉద్యోగం చేస్తున్నాం, ఇంత దుర్మార్గంగా ఎప్పుడూ ఎవరూ వ్యవహరించలేదు’ అంటూ బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆర్టీసీ దసరా ధమాకా

- ప్రయాణికులకు స్పెషల్ ఆఫర్లు
- రానుపోను టికెట్లపై 10 శాతం రాయితీ
- వివిధ నగరాలకు 80 సర్వీసులు
- ప్రత్యేక బస్సుల్లోనూ సాధారణ చార్జీలే

పుట్టపర్తి టౌన్: పండుగల వేళ ఆర్టీసీ ప్రత్యేక ఆఫర్లతో ప్రయాణికులను ఆకట్టుకుంటోంది. దసరా, దీపావళి, సంక్రాంతి, ఇతర పండగల వేళ జిల్లా వాసుల సౌకర్యార్థం ముఖ్య నగరాల నుంచి ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది. సెలవులు అధికంగా లభించే పండుగల్లో దసరా ఒకటి. ప్రజలపై అధిక భారం పడకుండా ఈ ఏడాది కూడా దూర ప్రాంతాలకు సాధారణ చార్జీలతో బస్సులు నడపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రైవేటు ట్రావెల్స్‌లో రెట్టింపు చార్జీలు వసూలు చేస్తుండడం, భద్రత అంతతమాత్రంగానే ఉండడంతో ప్రయాణికులు సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల వైపు మొగ్గుచూపుతున్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా సాధారణ చార్జీలతోనే ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది.

జిల్లా నుంచి 80 ప్రత్యేక సర్వీసులు

దసరా పండుగను పురస్కరించుకొని అక్టోబర్ 4నుంచి నుంచి 15 వరకు అన్ని ఆర్టీసీ డిపోల నుంచి హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ వంటి మహానగరాలకు ప్రత్యేక సర్వీసులు నడపనున్నారు. ప్రయాణికులు రానుపోను ఒకే సారి టికెట్టు బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీ కూడా కల్పిస్తోంది. జిల్లాలో ఆరు డిపోల నంచి 80 బస్సులు నడపడానికి ఆర్టీసీ రంగం సిద్ధం చేసింది. ప్రత్యేక సర్వీసుల్లో సాధారణ టికెట్ చార్జీలే వసూలు చేస్తారు. ఆర్టీసీ వెబ్‌సైట్‌లోనూ టికెట్లు బుక్ చేసుకోనే అవకాశం కల్పించింది.

సెలవుల్లో సొంతూళ్లకు..

జిల్లాలో పుట్టపర్తి, హిందూపురం, ధర్మవరం, కదిరి, పెనుకొండ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు ఉద్యోగం, వ్యాపారం, విద్య కోసం ఇలా చాలామంది ప్రజలు ముఖ్య నగరాలలో స్థిరపడ్డారు. విజయదశమికి 10 రోజులు సెలవులు రావడంతో సొంత ఊళ్లకు ప్రయాణం అయ్యేందుకు సిద్ధమయ్యారు.

విస్తుగొల్పుతున్న కూటమి రాజకీయం

- కార్యకర్తలు గొడవలు పెట్టుకుంటారు.. నాయకులు ఒక్కటవుతారు
- సందిగ్ధంలోనే మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున విధుల కొనసాగింపు
- కూటమి నాయకుల ఐక్యతా రాగంపై మండిపడుతున్న తెలుగు తమ్ముళ్లు



సాక్షి టాస్క్‌ఫోర్స్: నవ్విపోదురు గాక మాకేటి సిగ్గు అన్న చందంగా మారింది ధర్మవరంలోని కూటమి నాయకుల తీరు. గ్రూపులుగా విడిపోయి కార్యకర్తలు గొడవలు పడుతుంటే.. నాయకులు మాత్రం ఒక్కటవుతున్నారు. ‘కూటమి’ సరికొత్త రాజకీయం అందరినీ విస్తు గొలుపుతోంది. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సమీక్ష సమావేశానికి వస్తున్నారని తెలిసి శనివారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాలతో కార్యకర్తలు హంగామా సృష్టించారు. కమిషనర్ ధర్మవరంలో పనిచేయరాదంటూ ఏకంగా మంత్రి సత్యకుమార్‌ను ఘెరావ్ చేశారు. ఆదివారం నాటికి పరిస్థితి మారిపోయింది. కూటమి నాయకులైన చిలకం మధుసూదన్‌రెడ్డి, పరిటాల శ్రీరామ్, బీజేపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాస్‌లు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ‘ఐక్యత’ రాగం వినిపించారు. కూటమిలో విభేదాలు లేవని, నాయకులు ఐక్యంగా ఉన్నారని, ఎన్నికలకంటే మిన్నగా కలసికట్టుగా పని చేస్తామని ప్రకటించడంతో టీడీపీ కార్యకర్తలు డైలమాలో పడ్డారు.

కమిషనర్ కొనసాగింపుపై తేలని స్పష్టత

మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున విధుల్లో కొనసాగుతారా.. లేదా అన్నది ఇంకా సందిగ్ధంలోనే ఉండటంతో ముస్ముందు టీడీపీ కార్యకర్తల వైఖరి ఏమిటనేది తెలియాల్సి ఉంది. ప్రజల్లో మాత్రం అధికారులకు రాజకీయాలను ఆపాదించి ఇలా అవమానించడం ద్వారా భవిష్యత్‌లో ధర్మవరం రావాలంటే ఏ అధికారీ సాహసించరని, ఇక అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందన్న సందేహాలు వెల్లువెత్తుతున్నాయి.

మద్యం సిండికేట్‌ల కోసమేనా..?

ధర్మవరం నియోజకవర్గంలో మద్యం దుకాణాలకు త్వరలోనే టెండర్ ప్రక్రియ జరగనుంది. అయితే మద్యం దుకాణాలను తమ అనుచరులకు కట్టబెట్టేందుకే కూటమి నాయకులు ఒక్కటయ్యారన్న విమర్శలు ఆ పార్టీ కార్యకర్తల నుంచే ఉత్పన్నమవుతున్నాయి. బయట వ్యక్తులు మద్యం షాపులకు టెండర్ వేయకుండా కేవలం కూటమి నాయకుల అనుచరులు మాత్రమే రెండు మూడు దరఖాస్తులు వేసి షాపులు దక్కించుకోవాలని విశ్వప్రయత్నం చేస్తున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదే జరిగితే ప్రభుత్వానికి భారీగా ఆదాయం గండి పడనుంది. ఈ విషయంలోనే నిన్నటి వరకు ఉప్పు, నిప్పులా ఉన్న కూటమి నాయకులు ఒక్కటయ్యారని, ఈ తతంగం మొత్తం ఓ పార్టీకి చెందిన కూటమి నాయకుడి ఇంట్లో చర్చించి ఒప్పించినట్లుగా విశ్వసనీయ సమాచారం.

ఇదీ అసలైన ‘బాదుడు’..

- పశువులు, జీవాల సంతలో రెట్టింపు రుసుం
- కాపర్ల నడ్డి విరిచేలా కూటమి సర్కారు నిర్ణయం

అనంతపురం అగ్రికల్చర్: బాదుడే బాదుడంటూ గత ఐదేళ్లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారుపై దుష్ప్రచారం సాగించిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చి 100 రోజుల్లోనే అసలైన బాదుడుకు దిగారు. ప్రతి శనివారం జరిగే జీవాల సంతలో ఒక్కో జీవానికి వసూలు చేసే రుసుం రూ.30 నుంచి రూ.50కు పెంచారు. అలాగే ప్రతి ఆదివారం జరిగే సంతలో ఒక్కో పశువుకు రూ.100 నుంచి రూ.200కు తీసుకెళ్లారు. రెట్టింపుస్థాయిలో ‘బాదుడు’కు దిగడంపై కాపర్లు మండి పడుతున్నారు. అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రతి శనివారం గొర్రెలు, మేకలు, పొట్టేళ్ల సంత జరుగుతుంది. ఆదివారం ఆవులు, గేదెలు, ఎద్దుల సంత నిర్వహిస్తున్నారు. రాయలసీమ పరిధిలో అతి పెద్ద జీవాలు, పశువుల సంతగా ఈ సంతకు పేరుంది. సంతలో జరిగే క్రయ విక్రయాలకు ఒక్కో గొర్రె లేదా మేక లేదా పొట్టేలుకు రూ.30 ప్రకారం మార్కెట్‌ఫీజు వసూలు చేసేవారు. అలాగే ప్రతి ఆవు లేదా ఎద్దు లేదా గేదెకు రూ.100 ప్రకారం రుసుం కట్టించుకునేవారు. ఇలా ప్రతి వారం అనంతపురం మార్కెట్‌యార్డులో జరిగే పశువులు, జీవాల సంత ద్వారా రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఆదాయం సమకూర్చుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదాయం పెంచుకునేందుకంటూ సాధారణ కాపర్ల నడ్డివిరిచే కార్యక్రమానికి దిగడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరువు పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత తరుణంలో ఏకపక్షంగా రుసుం పెంచడం సరికాదంటున్నారు. దళారులు, వ్యాపారులతో సంబంధం లేకుండా కనీసం రైతుల నుంచి అయినా సాధారణ రుసుం వసూలు చేయాలని కోరుతున్నారు.



ఒక్కో గొర్రె, మేకకు రూ.50 చెల్లించాలని కలెక్షన్ కౌంటర్ వద్ద కట్టిన ఫ్లెక్సీ



మడకశిరలో రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు



పుట్టపర్తిలో చెరువును తలపిస్తున్న సత్యమ్మ ఆలయ ప్రాంగణం



మరువ పారుతున్న పుట్టపర్తి మండలంలోని గాజులపల్లి చెరువు

జిల్లా అంతటా వర్షం

- 24 మండలాల్లో 463 మి.మీ వర్షం
- పొంగిన వాగులు, వంకలు
- పలు చోట్ల నీట మునిగిన పంటలు
- గాజులపల్లి చెరువుకు మరోసారి వరద

పుట్టపర్తి అర్బన్: జిల్లా అంతటా ఆదివారం వర్షం కుమ్మేసింది. ఆదివారం ఉదయం మూడు గంటలపాటు ఏకధాటిగా కురిసింది. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. పలు చోట్ల పంట పొలాల్లోకి వర్షపునీరు చేరింది. 24 మండలాల్లో సగటు వర్షపాతం 463.4 మి.మీగా నమోదైంది. ఇందులో పుట్టపర్తి మండలంలో 64.6 మి.మీ భారీ వర్షం పడింది. ఇక హిందూపురంలో 40.2 మి.మీ, పెనుకొండలో 39.6, తనకల్లులో 34.2, సోమందేపల్లిలో 32.6, బుక్కపట్నంలో 29.6, నల్లచెరువులో 28.8, చిలమత్తూరులో 26.2, కొత్తచెరువులో 24.2, అమరాపురంలో 19.6, రొద్దంలో 19.4, గోరంట్లలో 18.2, పరిగిలో 15.6, ధర్మవరంలో 13.6, లేపాక్షిలో 10.2, అగళిలో 8.4, కదిరిలో 8.2, మడకశిరలో 6, అమడగూరులో 5.6, గుడిబండ, ఓడీచెరువులో 5.2, రొళ్లలో 4.6, నల్లమాడలో 2.2, బత్తలపల్లిలో 1.4 మి.మీ వర్షం కురిసింది. పలు వాగులు, వంకలు పొంగి పొర్లాయి. ఇటీవల వేరుశనగ తొలగించి ఆరబెట్టిన రాశుల్లోకి నీళ్లు చేరి నష్టం కలిగించాయి. పొలాలు, దారులు కోతలు పడడంతో పలు రకాల పంటలు నీట మునిగాయి. ఇక పుట్టపర్తి మండలంలో ఏర్పాటవుతున్న జాతీయ రహదారి పనులు చేపట్టిన బ్రిడ్జిలు నీట మునిగాయి. అక్కడక్కడా రోడ్డు భారీ కోతకు గురైంది. ముఖ్యంగా పెడపల్లి పంచాయతీలో బత్తలపల్లి సప్లయ్ చానల్ నిండుగా ప్రవహించింది. రెడ్డివారికుంట మరువ పారింది. ఇక గాజులపల్లి చెరువుకు మరోసారి వరద పోటెత్తింది. దీంతో పుట్టపర్తి, కొత్తచెరువు, ధర్మవరం మండలాల్లో వంగపేరు పారింది. పెడపల్లిలో జగనన్న కాలనీ రోడ్డు పూర్తిగా కోతకు గురైంది. నిర్మాణంలో ఉన్న గుంతల్లోకి నీళ్లు చేరాయి. జాతీయ రహదారి పనులకు ఆటంకం కలిగింది.

ఖరీఫ్ పంటలకు ఊరట

తీవ్ర వర్షాభావం కారణంగా ఎండుముఖం పట్టిన పంటలకు ప్రస్తుత వర్షంతో ఊరట లభించింది. వేరుశనగ, కంది, మొక్కజొన్న తదితర పంటలు వర్షాలకు తేరుకునే అవకాశం ఉందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వేరుశనగలో నష్టం వచ్చినా కంది పంట బాగుందని చెబుతున్నారు.

గర్భగుడిపై పిడుగు

తనకల్లు: మండల కేంద్రం తనకల్లులోని సాయిబాబా గర్భగుడిపై పిడుగు పడింది. ఆదివారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆ సమయంలో గర్భగుడిపై భారీ శబ్దంతో పిడుగు పడడంతో గోపురానికి రంధ్రం పడింది. పిడుగు పడిన సమయంలో ఆలయ సమీపంలో ఎవరూ లేకపోవడంలో పెను ప్రమాదం తప్పింది.



తనకల్లులో పిడుగుపాటుకు సాయిబాబా ఆలయ గోపురానికి పడిన రంధ్రం



హిందూపురం రైల్వేరోడ్‌లో నిలిచిన వర్షపునీరు



నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిలో భారీగా ప్రవహిస్తున్న వర్షపు నీరు



భారీ వర్షానికి పెడపల్లి వద్ద నీట మునిగిన అనప పంట



వేరుశనగ రాశుల్లోకి నీళ్లు చేరడంతో ఆరబెడుతున్న రైతులు

క్లుప్తంగా

పిడుగు పాటుకు వ్యక్తి మృతి


శ్రీనివాస్ (ఫైల్)

పావగడ: పిడుగుపాటుకు ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పావగడ తాలూకా కొడిగెహళ్లికి చెందిన శ్రీనివాస్ (45) తన ఇంటి వద్దనే కిరాణా కొట్టు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం సుమారు 8.30 గంటల సమయంలో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆ సమయంలో పిడుగు రాలడంతో ఇంటి బయట అంగడి వద్ద ఉన్న శ్రీనివాస్ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే కారులో పావగడలోని ప్రభుత్వాస్పత్రికి చేర్చారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆయనకు భార్య విజయలక్ష్మి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు అరసికెరె ఎస్‌ఐ ధారాసింగ్ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి దుర్మరణం

గోరంట్ల: విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. కాగా, మృతుడు విద్యుత్ తీగలు అపహరించుకెళ్లే వాడిగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... సోమందేపల్లికి చెందిన మహబూబ్‌బాషా (42) శనివారం రాత్రి గోరంట్ల మండలం కాగానిపల్లి – గొల్లపల్లి గ్రామాల మధ్య విద్యుత్ లైన్‌కు సంబంధించిన వైర్లు కత్తిరించే క్రమంలో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆదివారం ఉదయం అక్కడకు చేరుకుని పరిశీలించారు. కాగానిపల్లి సమీపంలో విద్యుత్ లైన్‌కు ఏర్పాటు చేసిన జంపర్లను కట్ చేస్తుండగా షాక్ గురైనట్లుగా ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. విద్యుత్ పరికరాలు దొంగలించేందుకు వచ్చి ఉంటాడనే అనుమానాలను స్థానికులతో పాటు, పోలీసులు వ్యక్తం చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

హిందూపురం టౌన్: అండర్–19 బాలబాలికల రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ కరాటే పోటీల్లో ప్రాతినిధ్యం వహించే జిల్లా క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ ఆదివారం హిందూపురంలోని ఎంజీఎం పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ గంగప్ప, ఎస్‌జీఎఫ్ అండర్–19 కార్యదర్శి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. బాలుర విభాగంలో రియాజ్, షబాజ్, మోహనకృష్ణ, హరీష్, లోకేష్, బాలికల విభాగంలో బరీర, నిఖిత, సిరి, నస్రీన్, మదీహ ఎంపికయ్యారు. వీరు త్వరలో వైఎస్సార్ జిల్లా రాజంపేటలో జరిగే రాష్ట్ర స్థాయిలో పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు పీడీలు లోకనాథ్, సురేష్, మోరార్జీ, కరాటే కోచ్‌లు ఫిరోజ్, షెక్షావలి, జనార్ధన్‌రెడ్డి తెలిపారు.

యానిమేటర్ల ఆకలి కేకలు



ఈమె పేరు కావ్య. అగళి మండలం కోడిపల్లి గ్రామంలో యానిమేటర్‌గా కొన్నేళ్లుగా పనిచేస్తున్న ఆమెను కూటమి ప్రభుత్వం ఏర్పాటైన కొన్ని రోజులకే తొలగించారు. ఆమె స్థానంలో మరొకరిని తీసుకున్నా... రికార్డుల్లో మాత్రం కావ్య పేరే ఉంది. అంతేకాక ఆమె పనిచేసిన కాలానికి సంబంధించిన గౌరవ వేతనాన్ని కూడా చంద్రబాబు ప్రభుత్వం చెల్లించలేదు.



ఇతని పేరు గోవిందప్ప. మడకశిర మండలం ఆర్.అనంతపురంలో గత పాతికేళ్లగా యానిమేటర్‌గా పనిచేస్తుండేవాడు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆయనకు ప్రభుత్వం అందజేసే గౌరవ వేతనమే జీవనాధారం. అయితే కూటమి సర్కార్ ఏర్పాటైన వెంటనే ఆయనను యానిమేటర్ విధుల నుంచి తొలగించారు. పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాన్ని కూడా చెల్లించలేదు. ప్రస్తుతం అతని కుటుంబం రోడ్డున పడింది.

--- ఈ పరిస్థితి వీరిద్దరిదే కాదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత జిల్లా వ్యాప్తంగా యానిమేటర్లపై టీడీపీ నాయకులు కక్ష సాధింపు చర్యలకు దిగారు. రాజకీయ రంగు పులిపి వారి జీవితాలతో చెలగాటమాడారు. ఫలితంగా చాలా మంది యానిమేటర్ల కుటుంబాల్లో ఆకలి కేకలు వినిపిస్తున్నాయి.


మహిళా పొదుపు సంఘాల సభ్యులతో సమావేశమైన యానిమేటర్ (ఫైల్)

- కూటమి సర్కార్ ఏర్పాటైన తర్వాత అందని గౌరవ వేతనం
- చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న యానిమేటర్లపై టీడీపీ నేతల కక్ష
- రాజకీయ రంగు పులిమి నిర్దాక్షిణ్యంగా తొలగింపులు

మడకశిర: రాష్ట్రంలో కూటమి సర్కార్ ఏర్పాటైన ఈ మూడు నెలలు వేతనాలు అందక యానిమేటర్లు (విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ – వీఓఏ) సతమతమవుతున్నారు. అప్పులతో బతుకీడుస్తున్న వారి కుటుంబాల్లో ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. వేతన బకాయిలు చెల్లించకపోగా... రాజకీయ రంగు పులిమి నిర్దాక్షిణ్యంగా విధుల నుంచి తొలగిస్తుండడంతో యానిమేటర్ల జీవనం మరింత దుర్భరంగా మారింది. జిల్లా వ్యాప్తంగా 1,261 మంది యానిమేటర్లు ఉన్నారు. వీరిలో ఇప్పటికే కూటమి సర్కార్ దాదాపు 60 శాతం మందిని తొలగించింది. ఇలా తొలగించిన యానిమేటర్ల స్థానంలో టీడీపీ కార్యకర్తలకు అవకాశం కల్పించడం గమనార్హం.

నిబంధనలకు పాతరేసి

టీడీపీ నాయకుల జోక్యం కారణంగా యానిమేటర్లను తొలగింపు అంశంలో నిబంధనలకు డీఆర్‌డీఏ అధికారులు పాతరేశారు. యానిమేటర్‌ను నియమించాలన్నా... తప్పించాలన్నా... ఆ గ్రామ సమాఖ్య సంఘం సభ్యుల నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. సభ్యులు అందజేసిన తీర్మానం మేరకు యానిమేటర్లను తొలగించాలనే నిబంధన స్పష్టంగా ఉంది. అయితే టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు నిబంధనలను తుంగలో తొక్కి ఎలాంటి తీర్మానం లేకుండానే యానిమేటర్లను తొలగించి కొత్తవారికి అవకాశం కల్పించారు. దీంతో వందలాది యానిమేటర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయి.

వేతనాలు చెల్లించకుండానే తొలగింపు

రాష్ట్రంలో కూటమి సర్కార్ ఏర్పడి మూడు నెలలు గడిచాయి. ఈ మూడు నెలల కాలంలో యానిమేటర్లకు నయా పైసా గౌరవ వేతనాన్ని కూడా చంద్రబాబు ప్రభుత్వం చెల్లించలేదు. వైఎస్ జగన్ హయాంలో ఈ ఏడాది జనవరి వరకు యానిమేటర్లకు గౌరవ వేతనం అందింది. ఆ తర్వాత సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ కారణంగా గౌరవ వేతనం చెల్లించడానికి సాధ్యం కాలేదు. ప్రభుత్వం మారి చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత యానిమేటర్లకు గౌరవ వేతనం చెల్లింపులో అంతులేని నిర్లక్ష్యం చోటు చేసుకుంది. అంతేకాక వేతన బకాయిలు చెల్లించకుండానే చాలా మంది యానిమేటర్లను విధుల నుంచి నిర్దాక్షిణ్యంగా తొలగిస్తూ వస్తున్నారు.

జిల్లాలో పని చేస్తున్న యానిమేటర్ల వివరాలు ఇలా......	
మొత్తం యానిమేటర్ల సంఖ్య	1,261
పురుష యానిమేటర్లు	576 మంది
మహిళా యానిమేటర్లు	685 మంది
నెలకు అందించే గౌరవ వేతనం	రూ.8వేలు

వేతనాలు చెల్లించాలి



వేతనాలు అందక చాలా ఇబ్బందులు పడుతున్నాం. కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సి వస్తోంది. ఇప్పటికే అప్పులు ఇచ్చిన వారు డబ్బు కోసం ఇంటి చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం వెంటనే బకాయి వేతనాలు చెల్లించడంతో పాటు ప్రతి నెలా క్రమం తప్పకుండా 1వ తేదీనే గౌరవ వేతనం అందించాలి.

– ఈరన్న, యానిమేటర్, టీడీపల్లి, రొళ్ల మండలం

అన్యాయంగా తొలగించారు



పదేళ్లుగా నేను యామినేటర్‌గా పనిచేస్తున్నా. మా గ్రామంలో నాకు మంచి పేరు ఉంది. ఎలాంటి ఆరోపణలు లేవు. అయితే కూటమి సర్కార్ వచ్చిన తర్వాత నన్ను అన్యాయంగా తొలగించారు. గౌరవ వేతనం బకాయిలు కూడా చెల్లించలేదు. కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలో అర్థం కావడం లేదు.

– గోవిందప్ప, మాజీ యానిమేటర్, ఆలదపల్లి, అమరాపురం మండలం

వివరాలు అప్‌లోడ్ చేస్తున్నాం



యానిమేటర్ల గౌరవ వేతనాల వివరాలను ప్రతి నెలా ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేస్తున్నాం. ప్రభుత్వం నేరుగా గౌరవ వేతనాలను యానిమేటర్ల ఖాతాల్లోకే జమ చేస్తుంది. కొన్ని నెలల గౌరవ వేతనం పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవం. త్వరలో గౌరవ వేతనం వారి ఖాతాల్లో జమ అవుతుంది.

– నరసయ్య, పీడీ, డీఆర్‌డీఏ

భర్తే కాలయముడయ్యాడు

గుమ్మఘట్ట: కలకాలం తోడూ నీడగా ఉంటానని ప్రమాణం చేసి తాళి కట్టిన భర్తే ఆమె పాలిట కాలయముడయ్యాడు. ఆదమరచి నిద్రిస్తున్న భార్యను కుటుంబ కలహాల నేపథ్యంలో గొంతు కోసి కడతేర్చాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుమ్మఘట్ట మండలం కలుగోడుకు చెందిన నరసింహులు, ఓబక్క దంపతుల కుమార్తె జ్యోతమ్మ (28)కు తొమ్మిదేళ్ల క్రితం గలగల గ్రామానికి చెందిన వన్నూరుస్వామితో వివాహమైంది. ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కూలి పనులతో జీవనం సాగిస్తున్న వీరి మధ్య మనస్పర్థలు చోటు చేసుకోవడంతో జ్యోతమ్మ పుట్టింటికి చేరుకుంది. ఈ క్రమంలో పెద్దలు రాజీ చేయడంతో ఐదు నెలల క్రితం కాపురానికి వెళ్లింది. ఇటీవల మారెమ్మ పండుగకు పుట్టింటికి జ్యోతమ్మ వెళ్లింది. నెల రోజులు కావస్తున్న ఆమె కాపురానికి వెళ్లలేదు. దీంతో ఆమెపై కక్ష పెంచుకున్న వన్నూరు స్వామి శనివారం మధ్యాహ్నం కలుగోడులోని అత్తింటికి చేరుకున్నాడు. సాయంత్రం వరకూ భార్యతో సరదగా గడిపాడు. ఆదివారం తెల్లవారుజామున 4గంటల సమయంలో నిద్రలో ఉన్న భార్య గొంతు కోసి హతమార్చి అక్కడి నుంచి పరారయ్యాడు. కుటుంబసభ్యులు, చుట్టుపక్కల వారు గమనించేలోపు గ్రామం దాటి వెళ్లిపోయాడు. విగతజీవిలా పడి ఉన్న కుమార్తెను చూసి కుటుంబసభ్యులు, చుట్టుపక్కల వారు కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు, సీఐ వెంకటరమణ, ఎస్‌ఐ ఈశ్వరయ్య అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గొర్రెల మందపై పిడుగు

గుత్తి రూరల్: మండలంలోని చెర్లోపల్లి పంచాయతీ పరిధిలో ఆదివారం రాత్రి పిడుగుపాటుకు 15 గొర్రెలు మృతి చెందాయి. బాధిత కాపరులు తెలిపిన మేరకు... చెర్లోపల్లి గ్రామానికి చెందిన లాలెప్ప, వెంకట్రాముడు... గొర్రెల పోషణతో జీవనం సాగించేవారు. ఈ క్రమంలో ఆదివారం గొర్రెలను మేతకు తీసుకెళ్లి సేవాగఢ్ సమీపంలోని ఖాళీ ప్రదేశంలో మందను నిలిపారు. రాత్రి ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో పిడుగు పడడంతో 15 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో ఐదు తీవ్రంగా గాయపడ్డాయి. దాదాపు రూ.2లక్షల మేర నష్టం వాటిల్లిందని, తమను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

నమ్మకం స్వదేశానికి రప్పించింది

- మస్కట్‌లో ప్రమాదమన్నారు
- హిందూపురం ఆస్పత్రిలో సాధారణ వైద్యంతో రికవరీ
- మూడు రోజుల్లోనే కోలుకున్న చిన్నారి


ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అవుతున్న చిన్నారి అయిజాతో తల్లిదండ్రులు, డాక్టర్ శివకుమార్

హిందూపురం: బతుకు తెరువు కోసం పరాయి దేశంలో స్థిరపడిన ఆ కుటుంబానికి అనుకోని చిక్కు వచ్చిపడింది. అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారి ప్రాణాపాయ స్థితిలో ఉందని ఆ దేశ వైద్యులు నిర్ధారిస్తే... స్వదేశీ వైద్యంపై నమ్మకం ఆ చిన్నారి ప్రాణాలను కాపాడింది. వివరాలు.... హిందూపురంలోని ఆర్టీసీ కాలనీకి చెందిన అయేషా, రిజ్వాన్ దంపతులు బతుకు తెరువు కోసం మస్కట్ దేశంలో స్థిరపడ్డారు. వీరి ఏడేళ్ల చిన్నారి అయిజాఫాతిమాకు తీవ్ర తలనొప్పి, జ్వరం, వాంతులు కావడంతో ఈ నెల 21న అక్కడి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అక్కడి ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేయడంతో పరీక్షించిన వైద్యులు చిన్నారి తలలో బ్లడ్ క్లాట్ కావడంతో ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని, వారం రోజుల పాటు అబ్జర్వేషన్‌లో ఉంచాలని సూచించారు. ఆ సమయంలో రిజ్వాన్‌కు దిక్కుతోచలేదు. వెంటనే ఫోన్ ద్వారా హిందూపురం ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్ శివకుమార్ సంప్రదించాడు. చిన్నారి వైద్య పరీక్షలకు సంబంధించిన నివేదికలు వాట్సాప్ ద్వారా పంపాడు. పరిశీలించిన డాక్టర్ శివకుమార్ అంత ప్రమాదమేమీ లేదని, రక్త ఎక్కించి అవసరమైన చికిత్స సరిపోతుందని తెలిపారు. ఇదే విషయాన్ని అక్కడి వైద్యులకు ఆయన ఫోన్‌లో వివరించినా వారు ఒప్పుకోలేదు. దీంతో చిన్నారిని డిశ్చార్జ్ చేయించుకుని ఈ నెల 27న హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం రక్తహీనత (4.4 శాతం)తో చిన్నారి బాధపడుతోందని నిర్ధారించుకుని వెంటనే అవసరమైన ఏ పాజిటివ్ రక్తాన్ని ఎక్కించారు. అవసరమైన చిన్నపాటి చికిత్సలు అందజేయడంతో కేవలం మూడు రోజుల వ్యవధిలోని చిన్నారి లేచి కూర్చొంది. రక్తహీనత వల్ల చిన్నారిలో ఆరోగ్య సమస్య తలెత్తిందని, బలవర్ధక ఆహారం అందించాలని తల్లిదండ్రులకు సూచించి ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. మూడు రోజుల పాటు ఓపీలో చూపించుకోవాలని సూచించారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యంగా ఉండడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

పాలక వర్గం ఆలోచనల్లో మార్పురావాలి

- అధికార మార్పిడితో సమసమాజ స్థాపన జరగదు
- లెనిన్ శతవర్ధంతి సభలో ప్రొఫెసర్ వి.కె.రామచంద్రన్


సభలో మాట్లాడుతున్న వి.కె.రామచంద్రన్


హాజరైన ప్రతినిధులు, నాయకులు

అనంతపురం అర్బన్: అధికార మార్పిడి జరిగినంత మాత్రాన సమాసమాజ స్థాపన సాధ్యం కాదని కేరళ ప్రభుత్వ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, ప్రొఫెసర్ వి.కె.రామచంద్రన్ అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురంలోని అలేఖ్య ఫంక్షన్ హాల్‌లో లెనిన్ శతవర్ధంతి సభ జరిగింది. ముందుగా లెనిన్ చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద అధ్యక్షతన 'రాజ్యం... విప్లవం' అంశంపై జరిగిన సదస్సులో రామచంద్రన్ మాట్లాడారు. సమాజంలో పాలకవర్గాలన్నీ పెట్టుబడిదారీ ప్రయోజనాలను కాపాడే లక్ష్యంగా పనిచేస్తున్నాయన్నారు. ఈ కారణంగానే సమాజంలో ఆర్థిక అసమానతలు అధికమయ్యాయన్నారు. భారతదేశంలో స్వాతంత్ర్యానికి పూర్వం సమసమాజ భావనలు అధికంగా ఉండేవన్నారు. క్రమంగా భావనలు మారుతూ బడాపెట్టుబడి, పెట్టుబడి, భూస్వామ్య లక్షణాల పెరిగి 1991లో సరళీకరణ ఆర్థిక విధానాల అమలుతో బలపడ్డాయన్నారు. దీనికి మతతత్వం కూడా తోడై ఆర్థిక అంతరాలు మరింత పెరిగిపోతున్నాయన్నారు. ఆర్థిక అసమానతలు రూపుమాపేదిశగా సీపీఎం ముందుకెళుతోందన్నారు. దేశంలో 271 మంది బిలియనీర్లు ఉండగా ఇందులో 94 మంది గడిచిన రెండేళ్లలో కొత్తగా పుట్టుకొచ్చిన వారే కావడం గమనార్హమని రామచంద్రన్ అన్నారు. మరో వైపు పేదరికం, దారిద్ర్యం పెరుగుతోందన్నారు. ప్రతి నలుగురు చిన్నారుల్లో ముగ్గురికి సరైన పౌష్టికాహారం లభించడం లేదని విషయాన్ని యూనెస్కో గణాంకాలు చెబుతున్నాయన్నారు. కార్మికులు కనీస వేతనాలకు నోచుకోవడం లేదన్నారు. అంతరాలు పోవాలంటే పాలకవర్గం ఆలోచన విధానంలో మార్పు రావాలన్నారు. సదస్సులో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్, రాష్ట్ర నాయకుడు జి.ఓబుళు, ప్రముఖులు డాక్టర్ భానుకిరణ్, ఎస్ఎంబాషా, గోవిందరాజులు, సత్యబోస్, రాజ్‌మోహన్, రమణయ్య, లాయర్ సతీష్, రంగనాయకులు, సత్యనారాయణరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సావిత్రి, నల్లప్ప, బాలరంగయ్య, నాగేంద్ర, శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటనారాయణ, నాయకులు రామిరెడ్డి, పరమేష్, జయచంద్ర, శ్రీదేవి, రామృష్ణారెడ్డి, మనోహర్, ఇర్ఫాన్, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

విద్య వ్యాపారీకరణ చేస్తున్న బీజేపీ

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యారంగంలో సమస్యల పరిష్కారానికి అక్టోబర్ 5 నుంచి 8వ తేదీ వరకూ అనంతపురంలో జరిగే రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాలను జయప్రదం చేయాలని వీకే రామచంద్రన్ పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆదివారం మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్‌తో కలసి ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి కేంద్రంలో అధికారం చేపట్టిన మోదీ ప్రభుత్వం విద్య వ్యాపారీకరణ, ప్రైవేటీకరణ, కాషాయీకరణ చేసే దిశగా అడుగేస్తోందని మండిపడ్డారు. నూతన జాతీయ విద్యా విధానం ద్వారా రాష్ట్రాల హక్కులు కాల రాస్తోందన్నారు. దీనిని కేరళ ప్రభుత్వం వ్యతిరేకిస్తోందన్నారు. మిగతా రాష్ట్రాలు కూడా కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, జిల్లా అధ్యక్షుడు సిద్ధు, జిల్లా సహాయ కార్యదర్శులు భీమేష్, శివ, వంశీ, నగర నాయకులు గణేష్, సోము, సాయి, ఎస్కే యూనివర్సిటీ నాయకులు మోహన్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి


గాయపడిన తిరుపాలు

ధర్మవరం రూరల్: చిగిచెర్ల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త, సోషల్ మీడియా కోఆర్డినేటర్ తిరుపాలుపై టీడీపీ కార్యకర్త సాకే శ్రీనివాసులు రాళ్లతో దాడి చేసి గాయపరిచాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తిరుపాలు భార్య లలిత గ్రామంలో అంగన్‌వాడీ ఆయాగా పనిచేస్తున్నారు. కూటమి సర్కారు వచ్చాక టీడీపీ కార్యకర్త సాకే శ్రీనివాసులు తరచూ అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తున్నాడు. తనకు అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాల తనిఖీ బాధ్యతలను తమ పార్టీ వారు అప్పగించారని చెబుతూ సిబ్బందితో అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. అంతటితో ఆగక తనిఖీల పేరుతో బెదిరింపులకు దిగుతుండటంతో లలిత ఈ విషయాన్ని భర్తకు శనివారం చెప్పింది. ఆదివారం గ్రామంలో కనిపించిన శ్రీనివాసులును తిరుపాలు కలిసి.. విధినిర్వహణలో లోటుపాట్లు ఉంటే అధికారులు చర్యలు తీసుకుంటారు కదా.. మీరెందుకు అంగన్‌వాడీ సెంటర్‌కు వెళ్లి తన భార్యను వేధిస్తున్నారని ప్రశ్నించారు. ఆగ్రహంతో ఊగిపోయిన శ్రీనివాసులు అక్కడే ఉన్న రాళ్లతో తిరుపాలుపై దాడి చేశాడు. గాయపడిన తిరుపాలును వెంటనే స్థానికులు ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దాడి ఘటనపై తిరుపాలు భార్య లలిత పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఫిర్యాదు వెనక్కు తీసుకోవాలంటూ టీడీపీ నాయకులు కొందరు బాధిత కుటుంబ సభ్యులను బెదిరింపులకు గురిచేస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా టీడీపీ కార్యకర్త సాకే శ్రీనివాసులు యానిమేటర్‌గా ఉంటూ వ్యక్తిగత మరుగుదొడ్ల బిల్లులలో రూ.లక్షలు స్వాహా చేసి.. జైలుకు సైతం వెళ్లి వచ్చాడని గ్రామస్తులు తెలిపారు.

ప్రాణాలు బలిగొన్న ఈత సరదా

తాడిపత్రి రూరల్: ఈత సరదా ఓ బాలుడి ప్రాణాలు బలిగొంది. స్థానికులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మండలం మల్లాపురం గ్రామానికి చెందిన ఉమాశంకర్ తన కుటుంబసభ్యులతో కలసి బతుకు తెరువు కోసం వలస వచ్చి సజ్జలదిన్నె సమీపంలోని కడప స్లాబ్ యూనిట్‌లో కూలీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం స్థానిక పంప్ హౌస్ వద్ద దుస్తులు ఉతకడానికి కుటుంబసభ్యులు వెళ్లారు. ఆ సమయంలో తన స్నేహితులతో కలసి ఉమాశంకర్ కుమారుడు హర్షవర్ధన్ (15) నీటి గుంతలో సరదాగా ఈత కొడుతూ లోతట్టు ప్రాంతానికి వెళ్లాడు. అప్పటికే అలసి పోయిన బాలుడు... ఆయాసంతో ఈద లేక నీట మునిగాడు. విషయాన్ని గమనించిన స్నేహితులు కేకలు వేయడంతో చుట్టుపక్కల దుస్తులు ఉతుకుతున్న వారు నీటి గుంతలో గాలింపు చేపట్టి వెలికి తీసేలోపు బాలుడు మృతి చెందాడు.

హైవేపై ఆర్తనాదాలు

- గార్లదిన్నె మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం
- అర్ధరాత్రి ఐచర్‌ను ఢీకొన్న ప్రైవేట్ బస్సు
- 16 మందికి గాయాలు
- విషమంగా ముగ్గురి పరిస్థితి



నుజ్జునుజ్జయిన బస్సు ముందు భాగం తీవ్రంగా దెబ్బతిన్న ఐషర్




అనంతపురం సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

గార్లదిన్నె: హైవేపై ఆర్తనాదాలు మిన్నంటాయి. గాయపడిన వారి హాహాకారాలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. ఐచర్‌ను ప్రైవేట్ బస్సు ఢీకొన్న ఘటనలో 16 మంది గాయపడ్డారు. అందులో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. గార్లదిన్నె మండలంలో ఆదివారం తెల్లవారుజామున ఈ ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గార్లదిన్నె ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపిన మేరకు.. మహబూబ్ నగర్ జిల్లా ఆత్మకూరు మండలంలోని బి.కొత్తకోట పాలెంకు చెందిన దాదాపు 30 మంది కూలీలు ఈ ఏడాది ఫిబ్రవరిలో బెంగళూరు వెళ్లారు. పనులు ముగియడంతో శనివారం అక్కడి నుంచి ఐషర్‌లో తిరుగు పయనమయ్యారు. గార్లదిన్నె మండలం తలగాచిపల్లి క్రాస్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై స్పీడ్ బ్రేకర్ వద్ద ఐషర్ డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. అదే సమయంలో బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఏపీఎం ట్రావెల్ బస్సు వెనుక నుంచి వేగంగా ఐషర్‌ను ఢీకొంది. ప్రమాదంలో బస్సు క్లీనర్, ఒడిశా రాష్ట్రానికి చెందిన ఉమాందతల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలు కాగా, ఐషర్‌లో ప్రయాణిస్తున్న మేస్త్రీ గౌతమ్‌కుమార్, ఆయన భార్య జ్యోతికి నడుము భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. కూలీలు లక్ష్మి, రాఘవ, జయమ్మ, చంద్రదుర్గ, కుమార్ దాస్, జ్యోతమ్మ, చంద్రాయుడు, మనెమ్మ, శీను, అనుషా, శ్రీషాల్, చంద్రన్న, సత్యమ్మలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. చిమ్మ చీకటిగా ఉండడం, ఊహించని ప్రమాదంలో గాయపడటంతో కూలీలు హాహాకారాలు చేశారు. అటుగా ప్రయాణిస్తున్న వాహనదారుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను వెంటనే 108 వాహనంలో అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. బస్సులో ఉన్న ప్రయాణికులను మరో బస్సులో హైదరాబాద్‌కు పంపించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో గౌతమ్‌కుమార్, ఆయన భార్య జ్యోతిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ప్రమాదం జరిగిన వెంటనే బస్సు డ్రైవర్ పరారయ్యాడు. ఈ క్రమంలో అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.